పేద వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

వైద్య విద్యార్థిని ప్రియాంకకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

దుండిగల్, జనవరి 23 : చెల్పూరు మండలం కృష్ణాజిగూడేనికి చెందిన దళిత విద్యార్థిని ప్రియాంక ఎంబీబీఎస్ సీటు సాధించి జనగామ మెడికల్ కాలేజీలో చదువుతున్నది. మెడిసిన్ పూర్తి చేయడానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ప్రగతినగర్‌లోని పట్టాభిరామం జనేయస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు స్పందించారు. గురువారం ఆలయ కమిటీ చైర్మన్ చల్లా సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ. 25 వేల చెక్కును విద్యార్థినికి అందజేసి సత్కరించారు. ఆలయ కమిటీ జనరల్ సెక్రటరీ ధనరాజ్,జాయింట్ సెక్రటరీ రాములు, వెంకట్‌రెడ్డి, తులసీదాస్, రవీందర్, అరవింద్,భాస్కర్, శ్యామల, విశ్వేశ్వరి, జయ,అరుణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

27న ఆర్టీసీ కార్మికుల సమ్మె సైరన్

బాలానగర్, జనవరి 23 : ఆర్టీసీ కార్మికులు ఈనెల 27న నిర్వహించే సమ్మెకు సిద్ధం కావాలని జేఏసీ పిలుపునిచ్చిందని కూకట్‌పల్లి జేఏసీ నేతలు ఐలయ్య, అక్బర్, మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల డిమాండ్ల సాధన కోసం 27న బస్ భవన్ వద్ద ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె సైరన్ మోగించడానికి జేఏసీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులందరూ సమ్మెలో పాల్గొని డిమాండ్ల సాధనకు కృషి చేయాలని సూచించారు. సెలవుల్లో ఉన్నవారు, వీక్లీ ఆఫ్‌లో ఉన్నవారు, స్పెషల్ ఆఫ్‌లో ఉన్నవారు, నైట్ అవుట్ డ్యూటీ ఇన్‌కమింగ్ అయిన వారు, మొదటి షిఫ్ట్ డే అవుట్ డ్యూటీ దిగిన వారు సైతం సమ్మెకు హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వంలో విలీనం కావాలంటే ప్రత్యక్ష పోరాటంలో ఆర్టీసీ కార్మికులు భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయండి

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 23 : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రోడ్లు వంటి పనులపై స్థానిక అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను మధ్యలో అపారని, త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని, ప్రజా సమస్యలపై అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడంలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు తదితర సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారులను నిష్పక్షపాతంగా ఎంపిక చేయాలన్నారు. అలాగే కాలనీలు, బస్తీల్లో ప్రజా సమస్యలను పరిష్కరించాలని డివిజన్‌ల వారీగా కార్పొరేటర్లు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పగుడాల శిరీషాబాబురావు, సబిహాబేగం, మహేశ్వరి, మందడి శ్రీనివాస్‌రావు, జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌రెడ్డి, ముద్దం నర్సింహయాదవ్, పండాల సతీశ్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు శ్రావణ్‌కుమార్, బాబురావు పాల్గొన్నారు.

ఆర్‌టీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎంవీఐ శ్రీనుబాబు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన సీహెచ్ సతీశ్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్యే

రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీలోని ఆర్‌టీఏ కార్యాలయంలో హైవే భద్రతా మాసోత్సవాలలో భాగంగా చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఎంవీఐ శ్రీనుబాబుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, ఆర్‌టీఏ కార్యాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కమ్మ సేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తదితరులు

దుండిగల్, జనవరి 23 : కుత్బుల్లాపూర్ కమ్మ సేవా సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం బహదూర్‌పల్లిలోని సంఘం భవనంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్, వివిధ జిల్లాల కమ్మసేవాసమితి అధ్యక్షులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కమ్మ సంఘం అధ్యక్షుడు రవిశంకర్,కార్యదర్శి రంగారావు తదితరులుపాల్గొన్నారు.

పీజీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ,ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ ఎంసీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 28లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 3 వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వివిధ లా కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేశారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 2 నుంచి నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ శశికాంత్ పేర్కొన్నారు.

ముందు జాగ్రత్తలతో క్షయను నిరోధించవచ్చు..

● డీఎంహెచ్‌వో రఘునాథ్‌స్వామి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 23: ప్రతి ఒక్కరూ ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటూ పౌష్టికాహారంతో క్షయ వ్యాప్తిని నిరోధించవచ్చని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యాధికారి రఘునాథ్‌స్వామి అన్నారు. గురువారం కూకట్‌పల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా 40 మంది క్షయ బాధితులకు పౌష్టికాహార కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ క్షయ వ్యాప్తిని నిరోధించడానికి ముందస్తు రోగనిర్ధారణ చేసుకోవాలని, లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్సను ప్రారంభించాలన్నారు. సహజ కాంతికి గురికావడం వల్ల టీబీ బ్యాక్టీరియా నశిస్తుందని, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోరు, ముక్కును కప్పి ఉంచాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వాదా టీబీ బ్యాక్టీరియా వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. ప్రతి రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యధికారిని శోభారాణి, టీబీ ప్రొగ్రామ్ ఆఫీసర్ శ్రీదేవి, యూపీహెచ్‌సీ డాక్టర్ మమత తదితరులు పాల్గొన్నారు.

టీబీ బాధితులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో రఘునాథ్‌స్వామి

డ్రైనేజీ మరమ్మతులను త్వరగా పూర్తి చేయండి

మియాపూర్, జనవరి 23 : భూగర్భ డ్రైనేజీ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సంబంధిత అధికారులకు సూచించారు. డివిజన్‌లో మురుగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మియాపూర్ విలేజ్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ మరమ్మతు పనులను గురువారం అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురుగు నీరు రహదారులపైకి చేరకుండా మరమ్మతు పనులను చేపట్టాలన్నారు. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో రాకపోకలకు అంతరాయం లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సునీత, లింగయ్య, స్థానిక నాయకులు మహేందర్, వజీర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం.. రూ. 6.99 లక్షల ఆదాయం

బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్న మేడ్చల్ ఎక్సైజ్ ఏఈఎస్ మాధవయ్య, సీఐ వేణుకుమార్, సిబ్బంది

బాలానగర్, జనవరి 23 : వివిధ ఎన్‌డీపీఎస్ కేసుల్లో పట్టుబడిన 40 వాహనాల వేలానికి విశేష స్పందన లభించింది. గురువారం బాలానగర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండ్ ఫయాజుద్దీన్ సూచనల మేరకు బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణుకుమార్ ఆధ్వర్యంలో 40 వాహనాలకు వేలం పాట నిర్వహించారు. మేడ్చల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ మాధవయ్య పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేలంలో 40 వాహనాలను ఉంచగా 30 మంది పోటీపడి కొనుగోలు చేశారు. ఇందులో 38 విక్రయించగా 2 వాహనాలను కొనుగోలు చేయడానికి ఎవరూ ఆసక్తి కనబరచలేదు. 40 వాహనాలకు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించిన ధర రూ. 4,32,400 కాగా 38 వాహనాలకు వేలంలో ఎక్సైజ్‌శాఖకు రూ. 6,99,592 ఆదాయం సమకూరినట్లు సీఐ వేణుకుమార్ పేర్కొన్నారు. ఎంవీఐ సూచించిన ధరతో పోలిస్తే రూ. 1,60,500 ఆదాయం అధికంగా వచ్చింది. కాగా జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి మరో రూ. 1,06,692 ఆదాయం వచ్చిందని తెలిపారు. కోర్టు అనుమతితో త్వరలో మరికొన్ని వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 29లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వివిధ దూరవిద్య పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు.

నిజాంపేట్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డి

దుండిగల్, జనవరి 23 : అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కార్పొరేషన్ పరిధి 12,14వ డివిజన్లలో గురువారం పలు అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. నిజాంపేట్ మంజీరా వాటర్‌ట్యాంక్ ఎదుట కేఎఫ్‌సీ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్, వెంకటరాయనగర్ కాలనీ నుంచి ఇందిరమ్మ కాలనీ ఫేస్-1 వరకు భూగర్భ డ్రైనేజీ, 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్-3లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, సాయినాథ్‌నగర్ కాలనీ శివాలయం వద్ద బాక్స్ డ్రెయిన్, టాయిలెట్స్ వంటి అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చిట్ల దివాకర్, రాజేశ్వరిచౌదరి, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు వీరేశ్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగేశ్‌చారి, వెంగయ్యచౌదరి, జగన్‌యాదవ్, జగదీశ్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి,సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్నవారికి అండగా ఉంటా..

బాధిత లారీ డ్రైవర్లకు జీతం డబ్బులను అందజేస్తున్న కార్మిక సంఘం నాయకుడు రవిసింగ్

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 23 : కష్టాల్లో ఉన్న వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర నాయకుడు రవిసింగ్ అన్నారు. పటాన్‌చెరువు పారిశ్రామికవాడలోని ధనలక్ష్మీ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటేడ్ రెడీమిక్స్ కంపెనీలో గత కొన్నేండ్లుగా లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్న 21 మందిని అకారణంగా పనిలోంచి తీసేసింది. అంతేకాకుండా వారికి ఇవ్వాల్సిన జీతం డబ్బులను ఇవ్వకుండా కంపెనీ యాజమాన్యం ఇబ్బంది పెడుతున్నది. దాంతో బాధిత లారీ డ్రైవర్లు కార్మిక సంఘం నాయకుడు రవిసింగ్‌ను ఆశ్రయించగా వెంటనే కంపెనీ యాజమాన్యంతో మాట్లాడారు. 21 మంది లారీ డ్రైవర్లకు రావాల్సిన మూడు నెలల జీతం డబ్బులు రూ. 1.90 లక్షలను వారికి ఇప్పించాడు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్లు కార్మిక సంఘం నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

24 వారాలకే పుట్టిన శిశువుకు వైద్యసేవలు

విష్ణు పారమిత దవాఖానలో చికిత్సపొందుతున్న శిశువు

కొండాపూర్, జనవరి 23 : చందానగర్‌లోని విష్ణు పారమిత వైద్యశాలలో 24 వారాలకే జన్మించిన శిశువును డాక్టర్లు 65 రోజుల పాటు ఐసీయూలో ఉంచి వైద్యసేవలందించి ప్రాణాలు కాపాడారు. గురువారం చందానగర్‌లోని హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పీడియాట్రిక్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ దుర్గాప్రసాద్, గైనకాలజిస్టు డాక్టర్ అరుణ వివరాలు వెల్లడించారు. బొల్లారానికి చెందిన గర్భిణీ కీర్తికి 24 వారాలకే పురిటినొప్పులు రావడంతో హాస్పటల్‌కు తరలించే క్రమంలో ఆడశిశువుకు జన్మనిచ్చింది. 750 గ్రాముల బరువుతో పుట్టిన శిశువును తీసుకొని తమ హాస్పటల్‌కు తీసుకువచ్చారని, ప్రత్యేక వైద్య సదుపాయాలు కలిగిన ఐసీయూలో ఉంచి శిశువుకు 65 రోజుల పాటు వైద్యసేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఉపిరితిత్తులు, గుండె, పేగుల రోగనిరోధక ఇబ్బందులు తలెత్తినప్పటికీ ఇంక్యూబేటర్‌లో ఉంచి ప్రత్యేకంగా ఉష్ణోగ్రతను సమతుల్యం చేస్తూ శిశువు ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. దీంతో పాటు పుట్టినపుడు 750 గ్రాముల బరువు నుంచి రెండు నెలల్లో ఒకటిన్నర కిలోల బరువుకు తెచ్చామన్నారు. శిశువును ఆరోగ్యంగా రక్షించినట్లు వైద్యులు పేర్కొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

జీడిమెట్ల, జనవరి 23 : పరీక్ష సరిగా రాయలేదని పదో తరగతి విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్ గణేశ్‌నగర్‌కు చెందిన లక్క మాణిక్‌రెడ్డి కుమార్తె(15) బాలానగర్‌లోని ఓ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నది. బుధవారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన బాలిక పరీక్ష సరిగా రాయలేదని తల్లితో చెప్పి దిగాలుగా కూర్చుండిపోయింది. ఇది గమనించిన తల్లి బాలికను సముదాయించి పడుకోమని చెప్పింది. రాత్రి నిద్రకు ఉపక్రమించింది. గురువారం ఉదయం 4 గంటలకు నిద్ర లేవడంతో చదువుకుంటుందేమోనని తల్లిదండ్రులు భావించారు. ఉదయం 6 గంటలకు బాలిక సోదరుడు లేచి చూడగా లుంగీతో వెంటిలెటర్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నది. తండ్రి ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 23 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేపీహెచ్‌బీకాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన చాకలి భీమప్ప(55) బతుకుదెరువు కోసం పదేండ్ల క్రితం నగరానికి వచ్చి.. కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లో నివసిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భీమప్ప ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి కొడుకు, భార్యకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా... సిబ్బంది చేరుకుని భీమప్ప చనిపోయినట్లు నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందులతో తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని కొడుకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నారు

నేడు విద్యుత్ సరఫరా బంద్

మాదాపూర్, జనవరి 23: ఫీడర్ మరమ్మతుల కారణంగా అల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ రాకేశ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాందాయ్-2 11 కేవీ ఫీడర్ పరిధిలోని మెరీడియన్ స్కూల్, ఎస్ కన్వెన్షన్ లేన్, బుట్టా కన్వెన్షన్ సమీపంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ సైన్యాధిపతి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను గురువారం వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటాలు, విగ్రహాలకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బోస్ పోరాటాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

- జోన్స్ బృందం

కేపీహెచ్‌బీ కాలనీ: మూసాపేట జనతానగర్‌లో నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, తూము శ్రావణ్‌కుమార్ తదితరులు



కేపీహెచ్‌బీ కాలనీ: జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

మూసాపేట : పంచశీల స్కూల్‌లో నేతాజీకి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, కరస్పాండెంట్ శ్రీనివాస్

శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలోని భవిత సెంటర్‌లో బోస్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన రామస్వామియాదవ్ తదితరులు

జగద్గిరిగుట్ట : వెంకటరామిరెడ్డినగర్‌లో..

సీసీ కెమెరాలతో మెరుగైన భద్రత

జగద్గిరిగుట్ట, జనవరి 23 : కాలనీలు, వ్యాపార స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుతో భద్రత పెరుగుతుందని జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ అన్నారు. షిర్డీహిల్స్ నల్లపోచమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం సీఐ ప్రారంభించి స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రధాన చౌరస్తాల్లో నిఘాపరికరాలు ఏర్పాటు చేసుకోవడానికి రావడం అభినందనీమన్నారు. ఎస్ఐ శంకర్, ఆలయ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వార్డు సభల్లో దరఖాస్తుల స్వీకరణ

కుత్బుల్లాపూర్, జనవరి 23 : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గురువారం అధికారులు వార్డు సభలు నిర్వహించారు. ప్రజల నుంచి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పలు పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. కమిషనర్ శ్రీహరి నేతృత్వంలో జరిగిన ఈ వార్డు సభల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, కౌన్సిలర్లు కిరణ్‌కుమార్, లక్ష్మీదేవేందర్, రవీందర్,రవియాదవ్‌తోపాటు అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఆడియాలజీ, ఎమ్మెస్సీ స్పీచ్ లాంగ్వేజ్ ప్యాథాలజీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

'రాణి కుముదినిదేవి సేవలు మరులేనివి'

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 23 : మహిళా సాధికారత కోసం రాణి కుముదినిదేవి చేసిన సేవలు మరువలేనివని రాందేవ్‌రావు వైద్యశాల డైరెక్టర్ విక్రమ్‌దేవ్‌రావు అన్నారు. రాణి కుముదినిదేవి జయంతి సందర్భంగా గురువారం కూకట్‌పల్లి రాందేవ్‌రావు వైద్యశాలలో నూతనంగా గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందేండ్ల క్రితమే కుముదినీదేవి మహిళల కోసం పాఠాలు చేశారని, ఆమె స్ఫూర్తితో వైద్యశాలలో పేదలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఎండీ కమలాకర్, సీఈవో ఎన్.యోబు, అనంత రెడ్డి, చాయాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 23 : కూకట్‌పల్లి(కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు కింది